*Prof. B. Rama Raju (Rtd)*
H. No. 1-8-117/2, Chikkadpally,
HYDERABAD - 500 020.

# ఇదా జీవితం?

శారద పెళ్లికి ఒప్పుకొంది.

అందులో తప్పు ఏం ఉందో కాని, 'నిజమే!' 'నిజంగానే,' 'అయ్యో రామ!' 'ఎంతగతి?' 'ఇదేం పాడుబుద్ధి!' 'ఛీ! ఛీ!!' 'దాని కర్మ!' నొసటి వ్రాత! అన్నారు.

తల్లిదండ్రులు తలబాదుకోవటం రివాజు. బంధువులు బాధపడటం సహజం. స్నేహితురాండ్రు ఆశ్చర్యపోవటం, న్యాయం.

మరి పెళ్లికొడుకు కళ్లనీళ్లు పెట్టుకొని ఎవరూ చూడకుండా తుడుచుకోటం, ఆనందమా? దుఃఖమా? అన్నది తేలని సమస్య.

ఏది ఏమైనా శారద మాత్రం, పరమానందంతో పొంగి పోతున్నట్లు కనిపించటం అభావం కాదు.

'ఎందుకే, ఇటువంటి నిర్ణయం తీసుకొన్నావు?' అన్న బి.ఎ. లో క్లాసు మేట్ ప్రశ్నకు 'యిందులో ఏముందే?' అన్నది శారద సమాధానం.

తలంబ్రాలురాలుతున్నప్పుడు తల్లిదండ్రుల కళ్లలోంచి కన్నీటి బిందువులు రాలుతున్నాయని శారదకూ తెలియదు. మూర్తికీ తెలియదు.

ఒక జంట—తల్లిదండ్రులు—ఆనందపడుతూవుంటే, మరో జంట విచారంలో మునిగి ఉన్నారు.

బాజాలు భజంత్రీలు మోగుతున్నప్పుడు పెళ్లి పందిట్లో కొన్ని గుండెల చప్పుళ్లుకూడా అవ్యక్తంగావున్నాయని అందరికీ తెలియక పోవచ్చు.

సూత్రధారణ సమయంలో మూర్తి ప్రక్క శారద ఒక్కతే లేదు. ఇద్దరు పసిపిల్లలు కూడా ఉన్నారు.

పెద్దది ఆడపిల్ల అయిదేళ్లు. చిన్నవాడు మగాడు మూడేళ్లు. గృహప్రవేశం చేసింది నాలుగు కాళ్లేకాదు. ఎనిమిది.

శోభనం గదిలో ప్రవేశించింది శారద ఒక్కతి మాత్రమే.

కాని లోపల ఉంది మూర్తి ఒక్కడే కాదు. మరి రెండు ప్రాణులు. అందులో పెద్దప్రాణి సుశీల. చిన్నప్రాణి సుందర్.

సుశీలకు నిద్రరాలేదు. ఎలా వస్తుంది? రాదు అన్ని చక్రకేళీలు, లడ్డులు, పాలు, బత్తాయిలు ఎదుట ఉంటే ఎలా వస్తుంది నిద్ర?

సుశీల నిద్రపోలేదు.

చక్రకేళీలను నిద్రపోనీయలేదు.

చేతులూ, చక్రకేళీలూ, నోరూ విరామం లేకుండా యున్నాయి. నోరు యంత్రంలాగా తిరుగుతూ ఉంది.

సుందర్‌కు ఈ సుందర దృశ్యంతో పనిలేదు. నిద్రకంటె సుందర వస్తువు జగత్తులోనే లేదన్నంత ధీమాగా చిన్నగా గురక పెడుతున్నాడు.

వాణ్ణి పూలపందిరి మంచంమీద పడుకోబెట్టి చిచ్చికొడుతున్నాడు మూర్తి.

తల్లిదండ్రులు తలకు మించిన ప్రయత్నంచేసి అంతకు ముందే విరమించుకొన్నారు.

తమకొడుకు శోభనం గదిలోకి వెళుతుంటే, మనుమరాలినీ మనుమణ్ణీ మరోగదిలో ఉంచేందుకుచేసిన ప్రయత్నం వ్యర్థ మయింది.

తండ్రిని విడిచి వాళ్లు ఒక్క_క్షణంకూడా ఉండలేరు. ఈవారం రోజులుగా జరుగుతున్న తంతు అంతా చూచి, తండ్రి తమకు దూరమయిపోతున్నాడని తల్లడిల్లిపోతున్నాయి పసి ప్రాణాలు.

అందుకే అరక్షణంకూడా అతనికి దూరంగా ఉండలేక పోతున్నారు.

పిల్లలిద్దరినీ మరోగదిలో పడుకోబెట్టి శోభనం గదిలోకి మూర్తి వచ్చీరాగానే, ఎలా నిద్ర లేచారో, ఎప్పుడు లేచారో బెట్టాపట్టాలు పట్టుకొని వచ్చేశారు.

వాళ్లను పొమ్మనలేకపోయాడు మూర్తి.

తండ్రిచేతి స్పర్శ సుఖం అనుభస్తూ ఆదమరచి నిద్ర పోయాడు మరుక్షణం సుందర్.

టేబుల్ మీద ఉన్న తినుబండారాల రుచి తెలుసుకొని నిద్రను నిద్రపుచ్చింది సుశీల.

గదిలోకి నెట్టి తలుపువేసి, అమ్మలక్కల కిటికీల దగ్గర చేరితే, వాకిట్లో నిలబడిపోయిన శారద, ఆ దృశ్యం చూచి ఆవురుమని ఏడుస్తుంది అనుకున్నాడు మూర్తి.

ఆమె ఏడవలేదు.

తంలొచుకొని, సిగ్గుగా నిలబడలేదు.

తల ఎత్తింది.

మూర్తిని చూడకుండా ఏటో ముఖం త్రిప్పుకోలేదు.

మూర్తి ముఖంలోకి చూచింది.

నిర్లిప్తంగా చూడలేదు నవ్వింది.

నవ్వు మామూలు నవ్వుకాదు.

తపస్సు ఫలించిన నవ్వు.

పెదాలమీద వెలుతురు అద్దినట్టు నవ్వుకాదు. గుండెల్లోంచి సెర్చిలైట్ వేసినట్లున్న నవ్వు.

కిటికీలలో గుసగుసలు నవ్వులు శారద గమనించింది—తల వంచుకొని, నేల చూస్తూ బొటనవ్రేలు గోరుతో నేలమీద గీరుతూ, చేతివ్రేళ్లు వంచుకొంటూ నిలబడలేదు.

నెమ్మదిగా వెళ్లి అమ్మలక్కల ముఖాలమీద కిటికీల రెక్కలు అలంకరించి వచ్చింది.

ఏమనాలో అర్థంకాక కూర్చునే ఉన్నాడు మూర్తి.

ఎందుకో శారద ముఖంలోకి చూడ లేకపోయాడు.

ఆమె గమనించింది. దగ్గరకు పోయింది.

'సార్.'

ఎంత మృదువుగా ఉందా పిలుపు!

తల ఎత్తి ముఖంలోకి చూశాడు మూర్తి. అతని కళ్లనిండా నీళ్లు.

జీవితంలోని తొలిసుఖం పొందబోయే భాగ్యశాలినికి కలుగబోతున్న అవరోధం తలచుకొని కుమిలిపోయాడు.

చక్కగా అలంకరించుకొని, ముద్ద మోహనంగా ఎదుట నిలబడ్డ తెల్లని చల్లని వెన్నెలవంటి శారదకు ఇదేనా రావలసిన పరిస్థితి?

మూర్తి హృదయం ఉడికిపోతూ ఉంది.

అతనికి ఆనందం లేదా? ఉంది. అయితే దుఃఖం ఎందుకు?

ఆమె మూర్తి కళ్లు తుడిచింది.

దానిలో బాధ అధికమయింది.

'శారదా' నా సంతోషం కోసం, నా ఆనందం కోసం, నాకోసం, నీ జీవితం బలైపోయింది కదా!?

'అలా అనొద్దు సార్'!

కళ్లప్పగించి ఆమె ముఖంలోకి చూస్తూ, అలాగే ఉండిపోయాడు.

శారద కుర్చీ లాక్కొని కూర్చుంది.

'నీ జీవితం నాశనం చేశాను శారదా.'

'అలా అనొద్దు సార్!'

నోటి కడ్డంగా చేయిపెట్టింది.

నెమ్మదిగా తొలగించుకొని, 'ఇంకా సార్ అంటావెందుకు శారదా! నీ జీవితంలో నిప్పులుపోసిన నన్ను ఇంకా సార్ అనొద్దు శారదా! అలా అనొద్దు'.

కళ్లు మూతలు పడిపోయినా, నోరు చేయీ మాత్రం మెలుకువతోనే ఉన్నాయి సుశీలకు వాటి పని అవి చేస్తున్నాయి.

తండ్రి మాటలకు కళ్లు విప్పి చూచింది.

'మాడు నాన్నను ఏడిపిస్తున్నావు'.

సుశీల ఏడుపు మొదలు పెట్టింది. నిద్రవచ్చి కొంత తండ్రి బాధ చూచి కొంత, అంతాకలసి ఏడ్పు!

'లేదమ్మా.'

ఇద్దరూ ఒకేసారి అన్నారు. ఒకరి ముఖాలు మరొకరు చూచుకొన్నారు. సుశీల ఏడ్పు మానింది.

శారద ఫక్కున నవ్వింది.

మూర్తికి ఎందుకో ఆనందమే కలిగింది.

మూర్తి లేచి, చాప నేలమీద వేసి దుప్పటి దిండూ వేసి సుశీలను ఎత్తుకొన్నాడు.

పాపను నేలమీద పడుకోబెట్టగానే శారద వెళ్లి పాపదగ్గర పడుకొని చిచ్చి కొట్టడం మొదలుపెట్టింది.

దిక్కు తెలియకుండా అటూ ఇటూ తిరుగుతుంటే, 'మీరు పడుకోండి సార్!' అంది శారద.

'సార్ అనొద్దు శారదా ప్లీజ్!'

'అనను లెండి'.

మూర్తి పందిరి మంచంమీద కూర్చున్నాడు.

మంచంమీద ఉన్న సుందర్ కలవరిస్తున్నాడు. 'లెడీ వన్ తూ త్రీ' వాడికేదో ఆట గుర్తుకు వచ్చి ఉంటుంది.

ఒకరి ముఖం మరొకరు చూచుకున్నారు నూత్న దంపతులు.

శారద చిచ్చి కొడుతూ తూలుతూ ఉంది.

ఆమెను చూస్తుంటే జానకి గుర్తుకు రాసాగింది.

ఏలోకంలో ఉందో.

తన నొసటన ఈ వ్రాత వ్రాసి ఏ లోకాలకు వెళ్లిపోయిందో.

ఆ రోజు, శోభనం గదిలోకి ఆమె వచ్చినప్పుడు ఎంత ఉత్సాహం!

గడచిన కాలం వెళుతూ వెంట బెట్టుకుపోయిన సంపద ఉత్సాహం.

జానకి పోతూ ఆనందం హరించుకుపోయింది. ఆనందం లేదు! ఉత్సాహం లేదు.

ఆనందం కావలసిన, ఉత్సాహం కావలసిన శారద ఆ రెంటికి వెలిఅయి, తూగుతూ ఉంది.

ఎంత మార్పు!

సృష్టిలో ఎంత విపరీతం!

పాపం శారద జీవితం నాశనమయింది.

చేజేతులా నాశనం చేశాడు, తను.

వీళ్లిద్దరకూ ఏదో పోలిక ఉంది. ఏమిటది? ఆకారంలో అన్నివిదాలా ఎంతో తేడా! కానీ, ఇద్దరూ స్త్రీలు. ఇద్దరూ ఓర్పుకు ప్రతీకలు.

ఓర్పువంటి శారద శోభనం గదిలో మొదటి రాత్రి భర్త సమక్షంలో పిల్లను ప్రక్కలో వేసుకొని కునుకుతూ ఉంది.

ఇదా జీవితం?

ఇలాగా జీవితం ప్రారంభం కావలసింది?

రెండేళ్లక్రితం—సుందర్‌ను ప్రక్కలో వేసుకొని, చాప మీద, నిద్రపోతున్న జానకి దృష్టిపథంలో మెదలింది.

నిద్ర ఎంత గొప్పది?

శారద నిద్రపోతూవుంది. నిద్రపోతూనే ఉంటుంది—రాత్రంతా నిద్ర పగలంతా నిద్ర! జీవితమంతా నిద్ర!

అంతకంటె ఏముంది శారదకు!

నిద్ర! నిద్ర! అనంతమైన నిద్ర.

మూర్తి గుండెలు అవిసి పోయాయి.

నిద్ర పోతూవుంటే శారద ముద్దు వస్తూ ఉంది.

సుశీల నిద్రపోతూ ఉంది.

నిద్రలో ఇద్దరూ పసిపిల్లలు.

ఒక విధంగా శారదకూడా తనకు కూతురు వంటిదే!

తన స్టూడెంట్స్ అందరూ బిడ్డలువంటివారే కదా!

ఈమె పరికోరి, ఈ నిర్భాగ్యుడిమీద జాలి తలచి భార్య అయింది.

తను అంగీకరింపకుండా ఉండవలసింది. మనిషి ఎంత స్వార్థపరుడు.

శారదా!

మూర్తి ఆమెను తట్టాడు.

స్పర్శలో—నవవధువు కోమల స్పర్శలో ఓర్పు, జాలి, సానుభూతి, ఆత్మార్పణ, త్యాగం, భక్తి మూర్తి దాల్చిన నవవధువు శరీర స్పర్శలో—ఎంత ఆనందం ఉంది!

ఆమె కదిలింది. కనులు విప్పి చూచింది. లేచి కూర్చుంది. బట్టలు సరిచేసుకొంది.

‹ఏం సార్?›

‹అలా అనొద్దు!›

‹చెప్పండి.›

‹బాబును ఇక్కడ పడుకో బెడతా!›

వద్దు! వాణ్ణి అక్కడే వుండనీయండి.

‹కాదు నువ్వక్కడ పడుకో!›

‹కాదు మీరు పడుకోండి.›

గది వెలుపల గోలలేదు నిశబ్దంగా ఉంది.

‹మీరు పడుకోండి.›

మూర్తి మంచంమీద కూర్చున్నాడు. శారద చాపమీద మేనువాల్చింది. నిద్ర రాలేదు.

మూర్తి సిగరెట్టు వెలిగించుకొని ఆ పొగ సృష్టించే వలయాలలో జీవితవలయాల తిలకిస్తూ కూర్చున్నాడు.

అయిదేళ్ళ క్రితం శారద కాలేజీలో ప్రవేశించింది. నాలుగేళ్లు మూర్తి ఆమెకు లెక్చరరు.

పసితనానికి భరతవాక్యం పలికి యౌవనానికి నాంది పలుకుతున్న సమయంలో శారద మూర్తిని చూచి 'ఎంత అందం' అనుకొంది.

మెల్లగా కళ్లు విప్పి భర్త ముఖంలోకి చూచి, కళ్లు మూసుకొని మనస్సులో అనుకొంది.

'అదే అందం.'

మూర్తి పాఠం చెబుతుంటే విని ఆదమరచిపోయే శారదను అంత పరవశత్వం పనికిరాదని తోటి విద్యార్థినులు అందరూ ఎగతాళి చేసేవాళ్లు.

అతని సౌందర్యం పట్ల ఆమెకు అభిమానం వుంది. పాఠం చెప్పే పద్ధతిమీద గౌరవం ఉంది. అంతే, అంతకంటే కొంచెం ఎక్కువగానీ మరి కొంచెం తక్కువగానీ ఏమీలేదు, అప్పట్లో.

మూర్తి శారదను ఆదరంగా పలకరించేవాడు, చనువు ఏర్పడింది.

కాలక్రమంలో భార్యపై మూర్తికున్న మక్కువ తెలిసి వచ్చింది.

జానకికి రెండో సంతానంగా మగవాడు కలిగినప్పుడు శారద తమ లెక్చరర్‌ను అభినందించటం కోసం మిగతా క్లాసుమెట్సుతో ఇంటికి వెళ్లిన రోజున చూచిన దృశ్యం ఆమె ఎప్పటికీ మర్చిపోలేక పోయింది.

ఆరోజే అనుకొంది.

'ఇంతకంటె స్త్రీకి ఏం కావాలి, ఇంకేం కావాలి'.

ఆ పారవశ్యం ఆమెను వెన్నంటుతూనే ఉంది, కాలేజీ చదువు పూర్తి అయిందాకా.

కాలేజీ నెల రోజులు సెలవుపెట్టి, సెలవు అయింతర్వాత, మూర్తి ముఖం చూడటానికి ఎంతో సిగ్గుపడింది. శారద.

ఎందుకో తెలియని సిగ్గు!

మూర్తికూడా ఎంతో బాధగా కన్పించేవాడు.

శారద ఫైనల్ బి.ఏ.లో ఉన్న రోజుల్లో భార్యా వియోగం వల్ల మూర్తి మనిషి కాలేకపోయాడు.

ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూ, ఎక్కడో ఏదో వెతుక్కొంటున్నట్లుండేవాడు.

శారదకు జాలివేసేది.

ఎవరు ఎంత సానునయ వాక్యాలు పలికినా అతను మామూలు మనిషి కాలేక పోయాడు.

ఒక సంవత్సరం అయినా కాక పూర్వమే మూర్తి పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నాడని తెలిసి అంత ఆదరంగా చూచు కొన్న భార్య జ్ఞాపకాలు ఇంత తొందరలో మరుగున పడిపో తున్నాయా అని బాధపడింది.

బి.ఏ. పాసయిన వేసవిలో మూర్తికి కృతజ్ఞత తెలుపు కోవటం కోసం వెళ్లిన శారద అతన్ని చూచి నిలువునా నీరైపోయింది. ఆవురుమని ఏడవాలనిపించింది.

మూర్తి ఎలాగో ఉన్నాడు.

ఆ విచార ముద్ర వెనుక ఎంత వేదనో, ఘోష ఉన్నాయో అనిపించింది.

అంత దుఃఖంలోనూ ఎంతో వాత్సల్యంతో శారదను దీవించి పంపుతూ పలికిన మాటలు మరువురావు.

ఆ మాటలకంటే, మూర్తి పొందుతున్న వేదనను మిళితం చేసుకొన్న గొంతు వ్యక్తంచేసిన తీరు హృదయ విదారకంగా ఉంది.

పందిరి మంచంమీద పడుకొన్న బాబు ప్రక్క బట్టలు తడిపాడు.

తడిబట్ట మార్చి పొడిబట్టవేసి తడిబట్ట దూరంగా వేయటానికి మూర్తి లేచి నిలబడితే, శారద ఆ బట్ట అందుకొని తీసుకుపోయి మూలనవేసి వచ్చింది.

'శారద!'

సిగరెట్టు టేబిల్ మీద ఆష్ ట్రేలో వేస్తూ పలకరించాడు.

'ఏమండి!'

'నువ్విక్కడ పడుకో, నేను పాపదగ్గర పడుకుంటాను'!

'తప్పండీ'.

శారద పాప దగ్గర మేను వాల్చింది.

'నా మీద నీకు కోపం లేదూ!'

'లేదండీ!'

తల తిరుగుతున్నట్లయి బాధగా కూర్చునాడు. శారద ఏమీ మాట్లాడలేదు.

'అమ్మా! అమ్మా!'

సుశీల కలవరిస్తూ ఉంది.

ఆ పసిది ఇంకా తల్లిని మర్చిపోలేదు.

'లేదమ్మా! లేదమ్మా!'

శారద చిచ్చుకొడుతూ ఉంది.

ఇలాగే అనేది జానికి ఇలాగే చిచ్చి కొట్టింది జానకి.

ఇలాగే జానకి! ఈమె జానకి శారదే జానకి!

'శారదా!'

'జానకి అనరూ!'

'అయ్యో!' తల పట్టుకొన్నాడు.

'బాధ పడకండి!'

మూర్తి మళ్లీ ఏమీ మాట్లాడలేదు, కళ్లు మూసుకొని తల పందిరి మంచంమీద ఎత్తుగా ఉన్న మూలకు పెట్టుకొని జారగిల పడ్డాడు.

పందిరి మంచం మీంచి వస్తున్న మల్లెల పరీమళం మత్తెక్కిస్తుండే కిటికీలోంచి వెలుపలికి చూస్తూ ఉంది శారద.

ఆకాశంలో వెన్నెల! అవని నిండా వెన్నెల! వెన్నెల వెల్లువలో ప్రకృతి!

గదిలో వెన్నెల కేంద్రంవంటి మూర్తి! వెన్నెలవంటి శారద! చంద్రుడికీ చంద్రికకూ ఎంత దూరం!

మూర్తికి ఇష్టం లేకపోయినా పిల్లల ఆలనాపాలనా చూచేందుకు మళ్లీ పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులు పట్టు బట్టారు.

వాళ్లిద్దరూ చెవుల్లో గూళ్లు కట్టుకొని పోరు పెడితే ఏదో ముహూర్తాన సరే నన్నాడు.

తనయితే అంగీకరించాడు గానీ మూర్తిని పెళ్లాడటానికి ఎవరూ ఒప్పుకోలేదు.

వాళ్లే విషయమూ దాచిపెట్టకుండా అన్ని సంగతులూ చెప్పారు.

మూడు సంబంధాలు అనుకొంటె మూడుచోట్లా చుక్కెదురు అయింది.

ఇష్టంలేని పెళ్లికి ఒప్పుకున్నాడు. అందుకే అవాంతరాలు వస్తే మూర్తి అల్లాడి పోయాడు.

నెల రోజులు కాలేజికి సెలువబెట్టి మంచం పట్టాడు మనో వ్యాధితో.

ఈ విషయం విన్న శారద సంచలించి పోయింది.

మూర్తి వీధిలోనికి రావటానికి ముఖం చెల్లటంలేదని తెలుసుకొంది.

ఆ పరిస్థితుల్లో ఉన్నప్పుడే శారదను చూడటానికి వచ్చారు.

ఆమెను చూడటానికి ఏముంది? అందం తక్కువలేదు. అ మాటకే వస్తే ఆ ఊళ్లో అంత అందమయిన అమ్మాయి లేదనవచ్చు. ఒక్కగా నొక్క-కూతురు. రెండులక్షుల ఆస్తికి వారసురాలు.

పెళ్లివాళ్లు మాకీ సంబంధ నచ్చింది అన్నప్పుడే శారదకు మరో ఆలోచన వచ్చింది.

'మాష్టారిని పెళ్లాడితే...'

'ఆయనకు నచ్చుతానో లేదో.'

'ఎలా ఈ పెళ్లి...'

శారద చాలా ఆలోచించుకొంది. నాకే పెళ్లి ఇష్టంలేదని తెగేసి చెప్పింది.

అంతటితో ఆగలేదు. ఇంకెంతో ఆలోచించింది. అన్ని ఆలోచనలు ముగిసింతర్వాత ఒక రోజు మూర్తి దగ్గరకు పోయింది.

'సార్.'

'ఏం శారద!'

‘ఏమనుకోకండి సార్!’

‘చెప్పు.’

‘నేను మిమ్మల్ని—మీకు అభ్యంతరం లేకపోతే—’

మూర్తి ఆమె మాటల కర్థం తెలుసుకొనేసరికే అక్కనుంచి వెళ్లిపోయింది.

లోపల తల్లితో మాట్లాడుతూ ఉంది.

‘ఏం చిన్నదాన్ని, నేనేం చిన్నదాన్ని కాదు. జానకి అక్క నాకంటె సంవత్సరం పెద్దది. స్కూల్ ఫైనల్ పాసయి ఆమె పెళ్లి చేసుకొంది. నేను బి.ఏ. చేసుకొన్నాను అంతే!

‘అమ్మా!’

నేనన్నీ ఆలోచించానండి!’

శారద వెళ్లిపోయింది....

ఉన్నట్టుండి మూర్తి లేచి మంచంమీద కూర్చున్నాడు.

శారద కనులు నిద్రకు దూరంగా దీపజ్వాలల్లాగ వెలుగుతున్నాయి.

‘ఏమండీ!’

మూర్తి ఏమీ మాట్లాడలేదు. సుందర్‌ను భుజంమీద వేసుకొని తీసుకుపోయి చాపమీద పడుకోబెట్టాడు.

‘శారదా!’

ఆమె గుడ్లప్పగించి చూస్తూ ఉంది.

‘లే.’

ఆమె కదలలేదు.

రెండు చేతులలో పైకి లేవనెత్తితే తీగలాగా ఊగిపోతూ నిలబడింది శారద.

పెళ్లికి వచ్చి వెళ్లిపోతూ ఒక నవలా రచయిత్రి—జీవితం అంతా కల్పనగా, అంతా ఆనందం, అంతా సుందర స్వప్నంగా భావించే రచయిత్రి—

'శారద చూచుకొన్న జీవితంలోని ఆనందం మీ కేమి అర్థమౌతుంది! పదిమందినీ పొడిచినట్లు చూచి చెప్పింది.

'వయస్సులో వాళ్లిద్దరికీ ఎక్కువ తేడాలేకపోయినా ఎందుకో ఈ పెళ్లి అసహజంగా ఉంది' అంది బాల్య వివాహం చేసుకొన్న వృద్ధురాలు.

'శారదకు ఏం కర్మ పట్టిందని రెండో పెళ్లి మనిషిని చేసుకోవాలి, వాదించిందొక స్త్రీ పెళ్లి పందిట్లో.

'రెండో పెళ్లి అయితేమాత్రం ఇద్దరు పిల్లల తండ్రినా?' వాపోయింది మరొక స్త్రీ!

'ఎన్నో పెళ్లి అయితేనేం—ఎందరు పిల్లలు తండ్రి అయితే నేమి—ఇటువంటి స్థితిలో ఈ పెళ్లా?' బాధ పడిందొక పిల్లలు లేని స్త్రీ, విషయం అంతా తెలిసి మ్రింగిపోతూ!

ఆ విషయం అర్థమయిన మరో స్త్రీ గంపెడు సంతానం చుట్టుముట్టి ఉండగా అంది.

'ఏం ఫరవాలేదు, ఎందుకమ్మా పిల్లలు!'

జానకి రెండో కాన్పు చాల కష్టం అయిపోయింది. బ్రతుకుమీద ఆశ వదులుకోవలసిందే అనుకొన్నారందరూ! అయితే జానకికి ప్రాణాపాయం కలగలేదు. ఆమె గండం గడిచి బ్రతికింది.

అయితే బాగా నీరసించి పోయిది.

ఆరోజు డాక్టరు చెప్పింది.

'ఈసారి ఈమెకు నెల తప్పితే కాన్పుకావటం చాలా కష్టం! ఈమె ప్రాణానికే ప్రమాదం.'

మూర్తి బాధతో తల్లడిల్లిపోయాడు.

ఏం చేయాలి! ఏం చేయాలి! వ్యధ చెందాడు.

పిల్లలు కలక్కుండా ఆమెకు ఆపరేషన్ చేయటం—ఆమె నీరసంగా ఉండటవల్ల—వీలుకాలేదు.

డాక్టరు ప్రోత్సాహంవల్ల ఈ ఇద్దరు పిల్లలు చాలులే అనుకొని, కలుగబోయే సంతానంకన్నా, అగ్నిసాక్షిగా వివాహం ఆడిని భార్య ప్రాణం ముఖ్యమనుకొని మూర్తి ఆపరేషన్‌ను అంగీకరించాడు.

పిల్లలు కలిగే స్థితిని మూర్తి కోల్పోయాడు.

తూర్పున సూర్యోదయం అయ్యేసమయంలో పందిరి మంచంమీద, మూర్తి, తన చేతుల్లో తీగలావాలి ఉన్న శారదను చూస్తూ 'ఎంత త్యాగం' అనుకున్నాడు.

వికసిత పుష్పంలాగా, మంచు తెరలు తొలగించుకొని ఉదయించే సూర్యుడిలాగు, ఒక్క ఉదుటున మేల్కొన్న శారద గోచరమయింది.

ఆనందం అవతలి అంచులాగా, ముఖం నిండా సంతోషం తాండవిస్తూ ఉండగా పిల్లలు కదులుతూ ఉంటే, ఒయ్యారంగా లేచిపోయి పిల్లలదగ్గర పడుకొంది శారద.